క్లుప్తంగా

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు



దుత్తలూరు ఆదర్శ పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

ఉదయగిరి/దుత్తలూరు: ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత, దుత్తలూరులోని ఆదర్శ, నందిపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జవహర్ నవోదయలో 9వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశానికి పరీక్షలను శనివారం నిర్వహించారు. ఉదయగిరిలో 312 మందికి గానూ 124 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. దుత్తలూరులోని ఆదర్శ పాఠశాల కేంద్రాన్ని తహసీల్దార్ యనమల నాగరాజు పరిశీలించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



ఉదయగిరి: మండలంలోని వడ్లమూడిపల్లిలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో యంత్ర, విగ్రహ, ధ్వజశిఖర, ప్రాణప్రతిష్టలు, పూర్ణాహుతి, కుంభాభిషేకం, సర్వదర్శనం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు.

కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలి

కావలి: కావలి డివిజన్ పరిధిలో కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వీ సుజాత వైద్యారోగ్య సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయ ప్రాంగణంలో కావలి డివిజన్ పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలతో శనివారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటిని సందర్శించి కుష్టు లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పీహెచ్‌సీకి పంపి వైద్యపరీక్షలు చేయించాలని సూచించారు. కేన్సర్‌పైన ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. తొలిదశలోనే కేన్సర్‌ను గుర్తించడం ద్వారా నయం చేసుకోవచ్చనే అంశాన్ని ప్రజలకు వివరంగా తెలియజేసి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పీ బ్రిజిత, కావలి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పీ పద్మావతి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా హల్‌చల్



మర్రిపాడు: మండలంలోని చుంచులూరు పంచాయతీలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా శుక్రవారం రాత్రి హల్‌చల్ చేసింది. చుంచులూరు, రాజుపాళెం గ్రామాల్లోని పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని విలువైన రాగితీగను అపహరించుకెళ్లారు. శనివారం ఉదయం గుర్తించిన రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం అందజేశారు. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తుండడంతో పంటలు ఎండిపోతూ ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి ప్రత్యేక నిఘా ఉంచి చోరీలను కట్టడి చేయాలని వారు కోరుతున్నారు.

16 నుంచి శ్రీవారి ఉత్సవాలు

వరికుంటపాడు: వరికుంటపాడు సమీపంలోని వైకుంఠపురం వద్ద నూతనంగా నిర్మించిన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రథమ వార్షిక వేడుకలను ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 16న సాయంత్రం విశ్వక్సేన పూజ, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ హోమం, 17న కలశారాధన, నవకలశస్నపనం, విశేష హోమాలు, కుంకుమార్చన, హనుమంతసేవ, 18న వేదాపారాయణం, కలశారాధన, ధన్వంతరీ హోమం, గరుడ వాహన సేవ, 19న సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి, శ్రీవారి కల్యాణోత్సవం, శేష వాహనసేవ నిర్వహించనున్నట్లు వివరించారు.

బీజేపీ విజయంపై హర్షం

ఉదయగిరి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై ఆ పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు యల్లాల మంజుల హర్షం వ్యక్తం చేసింది. శనివారం ఆమె వింజమూరులో విలేకరులతో మాట్లాడారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకోవడం వెనుక ప్రధాని నరేంద్రమోదీ కృషి ఎంతో ఉందన్నారు. ఇంత వరకు ఢిల్లీలో ఆగిపోయిన సంక్షేమం, అభివృద్ధి డబుల్ ఇంజిన్ సర్కారుతో శరవేగంగా ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు.

పొగాకు క్యూరింగ్‌లో

అప్రమత్తతే రక్ష

- తరచూ దగ్ధమవుతున్న పొగాకు బ్యారెన్లు
- నిర్లక్ష్యమే కారణమంటున్న అధికారులు
- లక్షల్లో నష్టపోతున్న రైతులు

మర్రిపాడు: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పొగాకు పంట చేతికి అందే దశలో చిన్నపాటి నిర్లక్ష్యంగా కారణంగా బుగ్గిపాలవుతోంది. నారు దశ నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంటను క్యూరింగ్ దశకు చేర్చేందుకు రైతులు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. తెగుళ్లు, నీటి ఇబ్బందులు, వాతావరణ పరిస్థితులు అన్నింటిని అధిగమించినప్పటికి బ్యారెన్లలో ఆకు కాల్చే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా ఆరుగాలం పడిన కష్టం మంటల్లో బూడిదవుతోంది. భారీ పెట్టుబడులతో సాగు చేసే పంట కావడంతో ఒక్క అగ్నిప్రమాదం రైతులను పీకల్లోతూ కష్టాల్లోకి చేరుస్తోంది. క్యూరింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండడం ద్వారా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని పొగాకు వేలం కేంద్రం అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు.

అధికంగా పండిస్తే అనర్థమే

డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 2023–24 పంట కాలానికి 6.3 మిలియన్ కిలోలకు అనుమతినివ్వగా, 6,600 హెక్టార్లలో 9.8 మిలియన్ కిలోల పొగాకును పండించారు. కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.362 లభించగా, కనిష్ట ధర రూ.140గా నమోదైంది. 2024–25 పంట కాలంలో 7.36 మిలియన్ కిలోలకు అనుమతి ఇచ్చారు. ఈ లెక్కన ఒక బ్యారెన్‌కు 3.37 హెక్టార్లలో అంటే 4,275 కిలోలు మాత్రమే పంటను పండించాలని అధికారులు సూచించారు. ఇది గత పంట కాలం కంటే 625 కిలోలు అధికం. గత మూడేళ్లుగా దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ పొగాకు పంట తగ్గుముఖం పట్టడంతో ధరలు ఆశాజనకంగా ఉండి రైతులు లాభాలను పొందారు. అయితే ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంతో పాటు విదేశాల్లోనూ పంట సాగు పెరిగిన నేపథ్యంలో బోర్డు అనుమతించిన మేరకే నాణ్యమైన పొగాకును పండిస్తేనే రైతులు నష్టాల నుంచి బయటపడుతారని అధికారులు చెబుతున్నారు.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- గత నెల 20న మర్రిపాడులోని గంగవరపు వెంకటసుబ్బయ్యకు చెందిన పొగాకు బ్యారెన్‌లో క్యూరింగ్ చేపడుతుండగా మంటలు చెలరేగి దగ్ధమైంది.
- గత నెల 23న మర్రిపాడు మండలం చిలకపాడులో బీ రత్నారెడ్డి, బీ కృష్ణారెడ్డికు చెందిన రెండు పొగాకు బ్యారెన్లు దగ్ధమయ్యాయి.
- ఈ నెల 5న మర్రిపాడు మండలం డీసీపల్లి మజరా ఖాన్‌సాహెబ్‌పేటలో వెన్నపూస చెన్నయ్యకు చెందిన పొగాకు బ్యారెన్ దగ్ధమైంది. ఈ ప్రమాదాల్లో బాధిత రైతులు లక్షలాది రూపాయలను నష్టపోయారు.



చిలకపాడులో బ్యారెన్‌లో చెలరేగిన మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది(ఫైల్)

జాగ్రత్తలు పాటించాలి



రైతులు ఎంతో శ్రమించి పండించే పొగాకు పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలి. క్యూరింగ్ సమయంలో పర్యవేక్షకుడితో పాటు రైతులు అప్రమత్తంగా ఉండాలి. తరచూ బ్యారెన్‌ను సందర్శిస్తూ గొట్టాలపై పొగాకు పడకుండా చూసుకోవాలి. బ్యారెన్ గొట్టాలపై పొగాకు పడితే మంటలు చెలరేగుతాయి. పొగాకుతో పాటు బ్యారెన్ సైతం అగ్నికి ఆహుతవుతుంది. తద్వారా రైతులు అధికంగా నష్టపోవాల్సిన పరిస్థితి కలుగుతుంది. నాణ్యమైన పొగాకు పండించాలనుకునే రైతులు అన్ని విషయాల్లో జాగ్రత్తలు పాటిస్తేనే లాభదాయకంగా ఉంటుంది.

–జీ రాజశేఖర్, వేలం నిర్వహణాధికారి, డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం

బ్యారెన్లు లేకున్నా..

గత మూడేళ్ల నుంచి పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండి లాభాలు రావడంతో బ్యారెన్లు లేని రైతులు సైతం పొగాకు సాగు వైపు దృష్టి సారించారు. బ్యారెన్లు లీజుకు తీసుకుని పొగాకు సాగుచేస్తున్నారు. బ్యారెన్ల ఖర్చులు కూడా పెరిగినా సరే రైతులు క్యూరింగ్ కోసం వాటిని ఆశ్రయిస్తున్నారు. అయితే పొగాకు క్యూరింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తున్న కారణంగా ఇటీవల కాలంలో తరచూ అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తద్వారా బ్యారెన్లతో పాటు ఆకు బుగ్గిపాలై నష్టపోతున్నారు. బ్యారెన్లలో ఆకు కాల్చే సమయంలో పర్యవేక్షకుడితో పాటు యజమానులు అప్రమత్తంగా ఉండాల్సిన అసరం ఉంది. బ్యారెన్ సామర్థ్యాన్ని మించి రెల్లు కర్రలు అమర్చడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్యారెన్‌లోని గొట్టంపై రెల్లు కర్రలు పడి మంటలు చెలరేగుతున్నాయి. బ్యారెన్‌లో క్యూరింగ్ చేసే సమయంలో తరచూ పరిశీలిస్తూ గొట్టాలపై పడిన ఆకులను వెంటనే తొలగించాలి. గొట్టంపై ఇనుప జల్లెడలు ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుంది. బ్యారెన్ వద్ద అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది.

స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలి



దుత్తలూరు: ప్రతి రేషన్ దుకాణంలో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ యనమల నాగరాజు రేషన్ డీలర్లకు సూచించారు. మండలంలోని నందిపాడులోని రేషన్ దుకాణాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. స్టాక్‌బోర్డును ఏర్పాటు చేసి సరుకుల నిల్వలను నమోదు చేయాలని డీలర్‌కు సూచించారు. లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందేలా చూడాలన్నారు. ఆయన వెంట వీఆర్‌ఏ మురళి ఉన్నారు.

సొసైటీ బకాయిదారులకు నోటీసులు

వరికుంటపాడు: వరికుంటపాడు సొసైటీకి బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేస్తున్నామని సొసైటీ సీఈఓ ఎం రత్తయ్య తెలిపారు. శనివారం ఆయన తన సిబ్బందితో కలిసి పెద్దిరెడ్డిపల్లి, టీసీపల్లి, పామూరుపల్లి, ఇస్కపల్లి, గండిపాళెం, కొత్తపల్లి, కొండారెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేశారు. సొసైటీ పరిధిలో 863 మంది రైతులు రుణాలు తీసుకుని ఉండగా, అందులో 350 మంది మొండి బకాయిదారులుగా ఉన్నారన్నారు. పంటరుణాలు రూ.1.50లక్షలు, దీర్ఘకాలిక రుణాలు రూ.68లక్షలు మొండి బకాయిలుగా ఉన్నాయన్నారు. సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు మార్చి నెలాఖరులోగా రుణాలను పూర్తిగా చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి రూ.42లక్షలు

ఆత్మకూరు: ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రానికి నూతన భవన నిర్మాణం కోసం రూ.42లక్షలు మంజూరైనట్లు అగ్నిమాపక కేంద్రం అధికారులు తెలిపారు. ఆత్మకూరులో 1983లో నిర్మించిన అగ్నిమాపక కేంద్రం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. నూతన భవన నిర్మాణానికి 2016లో టెండర్లు పిలువగా ఓ వ్యక్తి కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. పనులు చేస్తున్న క్రమంలో అతను ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఇటీవల పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తరువాత నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అగ్నిమాపక కేంద్రం అధికారులు తెలిపారు.



మంత్రుల పర్యటనకు పటిష్ట బందోబస్తు

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం ఐదుగురు మంత్రులు పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణంలోని పోలీసు స్టేషన్ నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు పోలీసులు, స్పెషల్‌ఫోర్స్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. పట్టణంలో మంత్రుల పర్యటనను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ ఆంక్షలను విధించినట్లు తెలిపారు. నెల్లూరుపాళెం వైపు నుంచి వచ్చే వాహనాలను ఆర్టీసీ డిపో వద్ద నుంచి పట్టణంలోకి అనుమతించమని తెలిపారు. సోమశిల రోడ్డులో చెరువు వద్ద నుంచి, చేజర్ల వైపు నుంచి పట్టణంలోకి వాహనాలకు అనుమతిలేదని, ఆ మార్గంలోని వాహనాలు శివాలయం, టెక్కేరోడ్డు మీదుగా పట్టణంలోకి అనుమతించనున్నట్లు వివరించారు. మంత్రుల పర్యటనకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కాగా ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని మంత్రుల పర్యటనపై పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమీక్షించి సూచనలు చేశారు.



అధికారులు, పోలీసులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ పావని

శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



సీతారామపురం: మండలంలోని ప్రాచీన శైవ క్షేత్రమైన ఘటిక సిద్దేశ్వరంలో శివరాత్రి ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులు, పరిసర ప్రాంత గ్రామాల పెద్దలు శనివారం సమావేశమయ్యారు. శివరాత్రి జాగారానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కల్పించాల్సిన వసతి, సదుపాయాలపై చర్చించి ఏకాభిప్రాయానికి వచ్చారు. గతేడాది శివరాత్రి నాటి నుంచి శనివారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు, జమ, ఖర్చులపై సమీక్షించారు. అలాగే ఈ నెల 16వ తేదీ ఆలయ ప్రాంగణంలోని దుకాణాలకు వేలం పాటలు నిర్వహించాలని నిర్ణయించారు.

104 వాహన సేవలు

చేజర్ల: మండలంలోని నెర్నూరులో 104 వాహన సేవలను శనివారం అందజేశారు. చిత్తలూరు పీహెచ్‌సీ వైద్యుడు నవీన్‌రెడ్డి సుమారు 60 మందికి బీపీ,షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యపరీక్షలు చేసి సూచనలు చేశారు. సీహెచ్‌ఓ మంజుల, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాసరావు

మర్రిపాడు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పోలిరెడ్డిపల్లిలో పోలీసుల పల్లెనిద్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులు కలిసిమెలిసి ఉండి శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద, కొత్త వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. సీసీ కెమెరాలతో నేరాలను కట్టడి చేయవచ్చన్నారు. ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వెంగళరావునగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం

కావలి: పట్టణంలోని వెంగళరావునగర్‌లో అర్బన్ హెల్త్‌సెంటర్‌ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం కొత్త శివాలయం నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు రూ.1.60కోట్లతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తొలుత పట్టణంలోని ఐ లవ్ కావలి సెల్ఫీ పాయింట్ వద్ద ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ ఫోటో దిగారు. ఐ లవ్ కావలి సెల్ఫీ పాయింట్‌ను బాగా తీర్చిదిద్దారని కితాబు ఇచ్చారు.



ఐ లవ్ కావలి వద్ద కలెక్టర్, ఎమ్మెల్యే

తేలని అల్లూరు పంచాయితీ

- 2020లో నగర పంచాయతీగా మార్పు
- ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల అభ్యంతరం
- పంచాయతీగానే కొనసాగిస్తేనే పన్నుల చెల్లిస్తామంటున్న ప్రజలు
- గత ఎన్నికల్లో అస్త్రంగా వాడుకున్న కూటమి నాయకులు
- 8నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం
- తాజాగా పన్నులు కట్టాలంటూ డిమాండ్ నోటీసులు
- లేకపోతే ఆస్తులు జప్తు చేస్తామని అధికారుల హెచ్చరికలు
- ఆందోళనలో నగర పంచాయతీ ప్రజలు



అల్లూరు నగర పంచాయతీ కార్యాలయం

అల్లూరు: గతంలో మేజర్ పంచాయతీగా ఉన్న అల్లూరులో సింగపేట, నార్త్‌మోపూరు పంచాయతీలను విలీనం చేస్తూ నగర పంచాయతీగా మార్పు చేశారు. దీనిపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పంచాయతీగానే కొనసాగిస్తేనే పన్నులు కడుతామంటూ అప్పట్నుంచి చెల్లింపులను నిలిపివేశారు. దీంతో పన్ను బకాయిలు తడిసిమోపడయ్యాయి. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం పన్నుల వసూలుకు డిమాండ్ నోటీసులను తెరపైకి తీసు కొచ్చింది. నగర పంచాయతీ అధికారుల ద్వారా నోటీసులు అందజేస్తోంది. మూడు రోజుల్లోగా పన్నులు చెల్లించకుంటే 1965 ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీ యాక్ట్‌లోని 2వ షెడ్యూలు 30 (1,2) నిబంధన ప్రకారం ఇంటిని జప్తు చేసి వేలం వేయడం జరుగుతుందని నోటీసుల్లో పేర్కొనడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

ఎన్నికల హామీని పట్టించుకోని కూటమి ప్రభుత్వం

గత ప్రభుత్వ హయాంలో 2020లో మేజర్ పంచాయతీగా ఉన్న అల్లూరులో సింగపేట, నార్త్‌మోపూరు పంచాయతీలను విలీనం చేస్తూ నగర పంచాయతీగా మార్పు చేశారు. దీనిపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పంచాయతీగానే కొనసాగిస్తేనే పన్నులు కడుతామంటూ అప్పట్నుంచి చెల్లింపును నిలిపివేశారు. దీంతో గత ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి పంచాయతీగా కొనసాగించేందుకు చర్యలు చేపట్టింది. అయితే ఈలోగా ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దీన్ని ఎన్నికల్లో కూటమి నాయకులు అస్త్రంగా మలుచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీగా మారుస్తామని హామీ ఇచ్చారు. అయితే 8నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టకపోగా పన్నుల వసూలుకు డిమాండ్ నోటీసులు అందజేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బాదుడే..బాదుడు

అల్లూరు నగర పంచాయతీ పరిధిలో ఇంటి పన్నులను బాదుడే...బాదుడు అన్న చందంగా పెంచుకుంటూ..వడ్డీలు వేసుకుంటూ పోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలో ఏడాదికోసారి 15 శాతం చొప్పున పన్నులు పెంచుకుంటూ పోతున్నారు. దీంతో ఒక్కో ఇంటిపై 30 నుంచి 50 శాతం పన్ను పెరిగింది. దీనికితోడు పన్నులు చెల్లించకపోవడంతో ఆరు నెలలకోకసారి వడ్డీ అదనంగా విధిస్తున్నారు. దీంతో పన్నులు తడిసి మోపడయ్యాయి. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు డిమాండ్ నోటీసులు ఇవ్వడంతో వాటిని చూసిన ప్రజలు కంగుతింటున్నారు. ఎలా కట్టాలో..ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.

రూ.2.60 కోట్ల పన్ను బకాయిలు

అల్లూరు నగర పంచాయతీగా మార్చినప్పట్నుంచి ఇప్పటి వరకు రూ.2.60 కోట్ల పన్ను బకాయిలు ఉండగా, అందులో రూ.20 లక్షలు మాత్రమే చెల్లించడం జరిగింది. ఏటా నగర పంచాయతీకి ప్రజలు ఇంటి పన్నుల రూపంలో రూ.80 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంది. కానీ పంచాయతీగా మారితేనే పన్నులు కడతామని ప్రజలు మొండి పట్టుదలతో ఉండటంతో నగర పంచాయతీగా మారినప్పట్నుంచి రూ.2.40 కోట్లు ఇంకా చెల్లించాల్సి ఉంది.

పన్నులు భారీగా పెరిగాయి



గతంలో పంచాయతీగా ఉన్నప్పుడు పన్నులు తక్కువగా ఉండేవి. నగర పంచాయతీగా మార్చిన తరువాత పన్నులు భారీగా పెరిగాయి. ఏడాదికి 10 శాతం చొప్పున పెంచుతున్నారు. పన్నులు చెల్లించకుంటే ఆరు నెలలకోకసారి వడ్డీ వేస్తున్నారు. నగర పంచాయతీ వలన అభివృద్ధి ఏమి జరగకపోగా పన్నులు మాత్రం తడిసిమోపడవుతున్నాయి.

–సోలా ఉమామహేష్, అల్లూరు

పంచాయతీగా మారిస్తేనే చెల్లిస్తాం



నగర పంచాయతీని రద్దు చేసి పంచాయతీగా మారిస్తేనే పన్నులు చెల్లిస్తామని ఎప్పటి నుంచో అధికారులకు చెబుతున్నాం. కొత్తగా డిమాండ్ నోటీసులు అందజేస్తూ పన్నులు కట్టకపోతే ఆస్తులు వేలం వేస్తామని అధికారులు భయభ్రాంతులకు గురి చేయడం తగదు. పంచాయతీగా మార్చిన మరుక్షణమే పన్నులు చెల్లించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారు.

–సుధీర్‌రెడ్డి, సింగపేట

అభివృద్ధికి సహకరించాలి



నగర పంచాయతీ పరిధిలో దాదాపు రూ.2.40 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయి. ప్రజలు పన్నులు కట్టకపోవడంతో డిమాండ్ నోటీసులు అందజేస్తున్నాం. జరుగుతుంది. పన్నులు చెల్లించని వారికి 1965 ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటి యాక్టులోని 2వ షెడ్యూలు 30 (1,2) రూల్సు ప్రకారం చర్యలు తప్పవు.


–ఉమామహేశ్వర్ రావు, కమిషనర్, నగరపంచాయతీ

జాకీర్ హుస్సేన్‌కు నివాళి



ఉదయగిరి: మండలంలోని బిజ్జంపల్లిలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి జాకీర్‌హుస్సేన్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. జాకీర్ హుస్సేన్ చిత్రపటానికి ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. గాంధీని స్ఫూర్తిగా తీసుకుని జాకీర్ హుస్సేన్ స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకున్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎన్నో ఉన్నత పదవులు పొంది దేశానికి సేవ చేశారన్నారు.

తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలని ఆందోళన



ఉదయగిరి: మెట్టప్రాంతమైన ఉదయగిరివాసుల తాగు, సాగునీటి కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం రైతుసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఎం రైతు సంఘం ఆధ్వర్యంలో ఉదయగిరిలో శనివారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్ట్‌లో అంతర్భాగంగా ఉన్న పెద్దిరెడ్డిపల్లి, సీతారామసాగర్ ప్రాజెక్టులు సత్వరమే పూర్తిచేసి సాగునీటిని అందించి కరువును నివారించాలని కోరారు. ఎంపీటీసీ విజయమ్మ, రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.